# ఓటు ఎవరికి?

ఆనాడు ఓబయ్య నాతో ఆ సాయంత్రం మా నిమ్మతోట దగ్గరకొచ్చి "దాళువా" నాకెందుకు చెరుకు నీళ్ళు పెట్టి ఇంటికి వెడుతూ, వెడుతూ నా దగ్గర కొచ్చాడు.

పచ్చ గరికమీద ఏటవాలుగా పడుకొని ఎరుపెక్కిన ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ ఓబయ్య మాటల్ని అట్టే పట్టించుకోలేదు కాని అతను జలగలాగ పట్టు వదలకుండా మళ్ళీ అన్నాడు: "ఓటెవరి కేసేది బాబూ?"

ఎలక్షనింకా మూడు రోజులే వుంది. పన్నెండు రోజుల క్రిందట ఊళ్ళో ప్రారంభమై "ఎన్నికల వాసన" దిన దిన ప్రవర్ధమానమౌతూ — "శివరాత్రి ఇంకా మూడు రోజులే వుంది" అన్నట్టుగా గ్రామాన్ని చైతన్యవంతంగా మార్చింది. ఏ ఎన్నికలొచ్చినా పల్లెటూళ్ళలో వుండే కదలిక పట్టణాలలో వుండదు. మా ఊరు సంగతి వేరే చెప్పనక్కర లేదు. ఎలక్షనయ్యేవరకూ దాని కనురెప్పలు వాలవు.

"ఓబయ్యా! మనకు స్వాతంత్ర్యం వచ్చాక, మన ప్రభుత్వం "వయోజన ఓటింగ్" పద్ధతి ప్రవేశపెట్టి, ఓ పవిత్రమైన హక్కును తారతమ్యం లేకుండా వయస్సు వచ్చిన ప్రతి వారికి ఇచ్చింది. నీహక్కును నువ్వు సక్రమంగా ఉపయోగించుకోవడానికి ఇతర సలహా లెందుకు? నీ మనసే నీకు న్యాయస్థానం. నీకు నువ్వే తేల్చుకోవాలి. నీమనస్సు కేపార్టీ మంచిదని తోస్తే ఆ పార్టీ వారికి నీ ఓటివ్వు!" అన్నాను సిగరెట్టు వెలిగించి.

"నీళ్ళు మంచివైతే తాగడానికి ఎవ్వరి సలహా అక్కర్లేదు బాబూ! మంచివి కానప్పుడే అనుమాన మొచ్చేది - తాగాలా, వద్దాఅని" అన్నాడు ఓబయ్య ములుగర్రను చేను గట్టున పెట్టి నా ఎదురుగా కూర్చుంటూ"

"అంటే——"

"బుద్ధి గడ్డితిన్నది బాబు! నిన్న పొద్దున్న మునసబుగారు పదిరూపాయలిచ్చారు. ఓటు తమపార్టీకే ఇవ్వాలన్నారు నేను డబ్బుకోసం మనస్సును అంగడిలో పెట్టినవాణ్ణికాదనీ ఓటు హక్కును అమ్ముకొనే నీచుణ్ణికాదనీ, డబ్బు తీసుకోనని ఎంత మొత్తుకున్నా వినకుండా పదిరూపాయల నోటును నా జేబులో కుక్కి మరి వెళ్ళాడు. పైపెచ్చు "నువ్వు ఏడుకొండలవాడి భక్తుడివి. ఆ దేవుని ఆనతో మాపార్టీకే వోటివ్వాలి" అన్నాడు. నా కడుపులో దేవింది. ఆ రాత్రే కరణం కనకయ్యగారు తమ ఇంటికి నన్ను పిలిపించి, కుశల ప్రశ్నలు వేసి, ఓ పదిరూపాయల నోటు నా చేతిలో పెట్టి "నీ ఓటు మాపార్టీకి వెయ్యాలి. తిరుపతి

వెంకటేశ్వరస్వామివారి ముందు ప్రమాణం చేసినట్టే" అన్నాడు. నా గొంతులో పచ్చివెలక్కాయ పడినట్టయింది. డబ్బు వొద్దని ఎంత బ్రతిమిలాడినా ససేమిరా విన్లేదన్నాడు. పైగా ఆయనగారి తుమ్మగుంట దగ్గర ఎకరం పొలమూ నేను పాలికి చేస్తున్నాను. నిరుడు గాలివానకి పంటంతా సీటిపాలై, మూడు బస్తాల ధాన్యం బకాయిపడితే దయతలచి ఆ బకాయిని రద్దు చేశాడు. ఆ ధర్మాత్ముని మాట ఎలా కాదనేది? నా ఓటుకోసం రెండు పార్టీల వాళ్ళూ డబ్బు లిచ్చారు. నా వోటువిలువ అంత గొప్పదా బాబూ ?"

ఓబయ్య అమాయకత్వానికి నవ్వుకున్నాను. ప్రజలింత అమాయకులు కాబట్టి ప్రజా ప్రతినిధులు కాగోరేవారు వాళ్ళ మనస్సుల్నీ, ఓటు హక్కుల్నీ బజారు వస్తువులాగా బేరాలాడుతూ కొనగలుగుతున్నారు!

"ఓటెవ్వరికి వెయ్యమంటారు బాబూ !"

ఓబయ్యకొచ్చిన సమస్య నిజంగా క్లిష్టమైందే. ఇరు పక్షాలవారూ డబ్బు లిచ్చారు. ఇరువురూ స్వామివారితో ప్రమాణం అన్నారు. అటు మునసుబుగారిమాటా, ఇటు కరణం గారిమాటా తీసివేయలేడు. ఇరువురిపైనా అతనికి భక్తిశ్రద్ధలు, వినయవిధేయతలు, గౌరవమర్యాదలు వున్నాయి. అలాంటి పరిస్థితుల్లో తన బుద్ధికుశలతను, విచక్షణా జ్ఞానాన్నీ, వ్యవహార దక్షతనూ వినియోగించి ఒక నిర్ణయం తీసికోగలంతటివాడు కాదు ఓబయ్య. అతని చదువు అంబటిప్రొద్దుదాటి వెళ్ళలేదు.

వ్యవహారాల్లోని గుంట చిక్కులు తెలియవు. రాజకీయాల్లో అసలు అక్షరాభ్యాసమే జరగలేదు. మట్టిలో పుట్టి, మట్టిని నమ్ముకొని బ్రతుకుతూ మట్టిలోనే కలిసే జీవితమే అతనిది. ఈ లగువు బిగువులేం తెలుసు! ఓబయ్యా నా సలహాకోసం పెర పెర లాడడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయినా నేను మటుకు ఏమని సలహా యిచ్చేది!

"నీ ఇష్టం ఓబయ్యా! నీకే విధంగా న్యాయంతోస్తే అలాగే చేయి. ఫలానా వాళ్ళకు ఓటు వేయమని నేను చెప్పడం అన్యాయమే కాగలదు."

ఓబయ్యకు భార్యపోయి రెండేళ్ళ పైచిలుకు అవుతుంది. మళ్ళీ పెళ్ళి చేసికోలేదు. ఉన్న ఇద్దరు పిల్లలూ పదేళ్ళ లోపు వాళ్ళే. ఓబయ్య భార్యే బ్రతికి వున్నట్టయితే—

ఈ సమస్యకు ఒక రకంగా పరిష్కారమార్గం లభించేది. చెరొక పార్టీకి ఓటు వేయడం.

ఓబయ్య దీర్ఘంగా ఆలోచనలో పడ్డాడు.

మసుసంజ లాలూకు మెత్తని కాంతులు సన్నగిల్లగా, ప్రకృతి ఊదారంగు దుస్తుల్ని ధరిస్తోంది. తూర్పు దిక్కునుంచి సోమరిగాలి వీస్తోంది.

తన బుర్రలో ఏ ఆలోచనా అందుబాటులో లేదని మునిమాపులావున్న అతని మొహమే చెప్పక చెబుతోంది.

తెలుగు విశ్వవిద్యాలయం

"అయితే ఓ పని చెయ్యి ఓబయ్యా! లాటరీ పద్ధతిలో నిర్ణయాన్ని ఎర్పర్చుకో. ఓ రూపాయి బిళ్ళతీసి బొమ్మా బొరుసో కోరుకొని— అందులో వొచ్చిన పార్టీకే ఓటివ్వు అన్నాను నేను.

ఓబయ్య ముహం ఆరు రేకులుగల పువ్వులా వికసించింది.

"మీరు చెప్పింది నిజమే బాబుగారు!" అన్నాడు ఓబయ్య సంతృప్తిగా.

లాల్చి జేబులోంచి రూపాయిబిళ్ళతీసి యిచ్చాను.

బొమ్మ అయితే మునసబుగారు బలపర్చే పార్టీకి ఓటు వేస్తానన్నాడు. బొరుసైతే కరణంగారు బలపర్చే పార్టీకి. రూపాయి బిళ్ళను గాలిలోకి ఎగురవేశాడు ఓబయ్య. బొమ్మే పడింది.

తన ఓటు మున్సబుగారు బలపర్చే పార్టీకే అన్నాడు ఓబయ్య.

అతని సమస్య అంత తేలికగా పరిష్కారమైనందుకు నాకూడా సంతోషమేసింది. కాని వాస్తవంగా ఆ సమస్య అంతటితో పరిష్కారం కాలేదు.

మరునాడు ఉదయం ఓబయ్య మా ఇంటికొచ్చాడు. వసారాలో పడకకుర్చీలో కూర్చుని ఆనాటి దినపత్రికను చూస్తున్నాను.

"మళ్ళీ చిక్కొచ్చిపడింది బాబుగారూ!" అన్నాడు ఓబయ్య గడపమీద కూర్చుంటూ.

"ఏమిటి!"

"రాత్రి మీ దగ్గర్నుంచి ఇంటికి వెళ్ళాక మళ్ళీ కరణం గారు పిలిపించారు. వెళ్ళాను. ఇంకో అయిదురూపాయలు చేతిలో పెట్టి ఓటు తమపార్టీకే తప్పకుండా ఇవ్వాలని పట్టు పట్టాడు. నాకు మునసబుగారు అంతకుముందే పదిరూపాయ లిచ్చినట్టు తెలిసిందట. ఇప్పుడేం చేయాలి? చిత్తువేయడంలో మునసబుగారి పార్టీకి ఓటు వేయాలనేది తేలిపోయింది. ఇప్పుడు కరణంగారు మరో అయిదురూపాయలిచ్చాడు. ఎక్కువడబ్బు యిచ్చాడు కనుక ఆయన బలపర్చే పార్టీకే ఓటు వేస్తే పోతుం దేమో!" అన్నాడు ఓబయ్య.

ఈసారి సమస్య అంత క్లిష్టంగా ఉన్నట్టు లేదు.

"నీ ఇష్టం! నేను చెప్పేదేముంది?" అన్నాను చిరాగ్గా.

"అదికాదు బాబూ! రేపే ఎలక్షను. ఒకవేళ ఈ రాత్రికి ఈ సంగతి మునసబు పార్టీవారికి తెలిసి మరో అయిదు రూపాయలు నా కిస్తారనుకోండి అప్పుడు నేనేంచే యాలి? అన్నాడు ఓబయ్య కనుబొమ్మలు చిట్లిస్తూ.

అతని ముందు చూపుకు నేను విస్మయం చెందాను.

"బొమ్మా, బొరుసూ ఉపాయం వుండనేవుందిగా"

"అల్లాగే బాబూ!" అంటూ వెళ్ళాడు ఓబయ్య.

నీతికీ నిజాయితీకి నిలబడి నిల్చేలాగే మనిషి ఓబయ్య అనే అభిప్రాయం నాకుండేది. ఎన్నికలు మనుషుల మనస్తత్వాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయి!

పోలింగ్ రోజున ఉదయం ఆరుగంటలకు ఓబయ్య మా ఇంటికొచ్చాడు తలదించుకొని... అతని మొహంలో కత్తివాటుకు సజీవమైన నెత్తురుబొట్టు లేదు.

"ఏం ఓబయ్యా?" అన్నాను.

అతను మారుమాట్లాడకుండా ఎడమచేతి చూపుడు వ్రేలిని నాకు చూపెట్టాడు.

దిగ్భ్రమతో నా కళ్ళకు చీకట్లు క్రమ్మాయి. అతని వ్రేలి మీద పోలింగ్ సమయంలో ప్రిసైడింగ్ ఆఫీసరు ఓట్లు పోలు చేసినట్టు వేసే గుర్తు - నల్లసిరా చుక్క వేసివుంది.

"అదేమిటి ఓబయ్యా! పోలింగ్ మొదలు ఎనిమిది గంటలకు కదా! అప్పుడే ఓటువేసి వచ్చావా?" అన్నాను ఆశ్చర్యాన్నుంచి తేరుకుని.

"నన్ను ఓటు చేయనివ్వరట గదండీ బాబుగారూ! కరణంగారి దగ్గర మొత్తం పదిహేను రూపాయలు తీసికున్నానని తెలిసి, రాత్రి మునసబుగారు మరో అయిదు రూపాయిలు నాకిచ్చి, నా ఎడంచేతి చూపుడు వ్రేలికి ఈ సిరామార్కు వేశారండి! దీని తస్సచెక్కా ఎంత రుద్దినా ఊహూ మచ్చ పోవడం లేదండి!" అన్నాడు ఓబయ్య కుడిచేతి బొటనవ్రేలితో ఆ సిరా మార్కును రుద్దుతూ.